క్లుప్తంగా

శాప్ నెట్‌వర్క్ చైర్మన్ రాజీనామా


మాచాని వెంకటేష్

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర శాప్ నెట్‌వర్క్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి ఎమ్మిగనూరుకు చెందిన మాచాని వెంకటేష్ గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు శాప్ నెట్‌వర్క్ సీఈఓకు తన రాజీనామా పత్రాన్ని పంపారు. తనపై నమ్మకముంచి శాప్ నెట్‌వర్క్ చైర్మన్ పదవి ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, తనకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

పదవికి రాజీనామా


రేణుక

ఆదోని అర్బన్: ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రేణుక గురువారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని సంబంధిత అధికారులు ఆమోదించాలని ఆమె కోరారు. ఇన్ని రోజులు తనకు సహకరించిన ప్రజలకు, సంబంధిత అధికారులకు, రాజకీయ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

విత్తనాలను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు


విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ మహేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: రైతులకు విత్తనాలను ఎంఆర్‌పీకే విక్రయించాలని, అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. ఆయన గురువారం స్థానిక విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. స్టాక్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని, నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే చర్యలు ఉంటాయని చెప్పారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు బిల్లు తప్పకుండా తీసుకోవాలన్నారు. అలాగే ఎరువుల కొరత సృష్టించరాదని, ఎంఆర్‌పీ ధరకే విక్రయించాలని ఆదేశించారు.

దర్గాకు పోటెత్తిన భక్తులు



ఖాదర్‌లింగ స్వామి సమాధి

కౌతాళం: కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీ స్వామివారి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

కరణిలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

కౌతాళం: మండల పరిధిలోని కరణి గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు భీమారెడ్డి, శేషయ్య, మహేశ్, ఉమేష్ తెలిపారు. వారు గురువారం మాట్లాడుతూ గ్రామంలో ఏరువాక పౌర్ణమి పండుగను పురస్కరించుకుని కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 19వ తేదీలోపు ఎంట్రీ ఫీజు రూ.600 చెల్లించి జట్టు పేరు నమోదు చేయించుకోవాలన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.11,116, రెండవ బహుమతి రూ.7,116, మూడవ బహుమతి రూ.3116 అందిస్తామని ప్రకటించారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం


మద్యాన్ని ధ్వంసం చేసేందుకు సిద్ధం చేసిన పోలీసులు

కృష్ణగిరి: మండలంలోని వివిధ కేసుల్లో పట్టుబడిన అక్రమ మద్యాన్ని గురువారం పోలీసులు ధ్వంసం చేశారు. పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో హంద్రీనీవా కాలువ పక్కన మద్యాన్ని ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ 14 కేసులకు సంబంధించి 7,969 టెట్రా ప్యాకెట్లు, 60 లీటర్ల నాటుసారా నేలపాలు చేశామని చెప్పారు. వీటి విలువ రూ.4,50,000 గా ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీఆర్వో వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


ఆదోనిలో తరగతి గదిలో విద్యార్థులు


కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అడ్మిషన్ చేస్తున్న స్పెషల్ ఆఫీసర్ షబానా అజ్మాన్


కౌతాళంలో మధ్యాహ్న భోజనానికి ముందు ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

మోగిన బడి గంట


కోసిగిలో ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ-2 నాగేశప్ప

ఆదోని సెంట్రల్: వేసవి సెలవులు ముగియడంతో గురువారం పాఠశాలలు తెరుచుకున్నాయి. మొదటిరోజు కావడంతో ప్రభుత్వ, ఎయిడెడ్, పురపాలక, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు తక్కువగానే వచ్చారు. వచ్చిన విద్యార్థులను ఆయా తరగతి గదుల్లో కూర్చోబెట్టి ఉపాధ్యాయులు తగిన సూచనలు, సలహాలను అందించారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో సరదాగ గడిపిన జ్ఞాపకాలను స్నేహితులతో పంచుకుంటూ సరదాగా గడిపారు. ప్రాథమిక పాఠశాలల్లో 1వ తరగతి, ఉన్నత పాఠశాలల్లో 6వ తరగతికి చేర్చాల్సిన పిల్లల అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు ఆయా పాఠశాలలకు చేరుకున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పుస్తకాలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలకు వచ్చి తీసుకుని వెళుతున్నారు. ఇప్పటివరకు నోట్ పుస్తకాలు పూర్తిస్థాయిలో వచ్చినా 1వ తరగతి నుంచి 10 వతరగతి వరకు పాఠ్యపుస్తకాలు 60 శాతం వచ్చినట్లు మండల విద్యాధికారి-2 శ్రీనివాసులు తెలిపారు.

అడ్మిషన్లకు ఈ సర్టిఫికెట్లు తీసుకుని రావాలి

ఈ నెల 19వ తేదీ నుంచి పాఠశాలల్లో అడ్మిషన్లు జరుగుతాయని పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.మల్లికార్జున తెలిపారు. 6, 7వ తరగతిలో అడ్మిషన్ కోసం విద్యార్థి టీసీ, విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, విద్యార్థి, తల్లి బ్యాంకు ఖాతా జిరాక్స్, విద్యార్థి ఫొటో తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. తలిదండ్రుల ఫోన్ నంబర్ తెలపాల్సి ఉంటుందన్నారు.


బాపురంలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

కోసిగి: 2024-2025 విద్యా సంవత్సరంలో భాగంగా గురువారం పాఠశాలలన్నీ తెరుచుకున్నాయి. కోసిగి మండలంలో 13 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, మోడల్ స్కూల్, 33 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 15,274 మంది 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు. ఐదేళ్లు నిండిన పిల్లలను 1వ తరగతిలో చేర్చుకుంటున్నారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్ షబానా అజ్మాన్ ఆధ్వర్యంలో.. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకుని సీటుకు ఎంపికైన వారిని 6వ తరగతిలో చేర్చుకుంటున్నారు. అలాగే ఇంటర్మీడియెట్‌లో బైపీసీ, ఒకేషనల్ కోర్సులో బాలికల సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి కలిగిన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు టీసీ, స్టడీ సర్టిఫికేట్స్‌తో పాఠశాలకు రావాలని ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఎంఈఓ-2 నాగేశప్ప పాఠ్య పుస్తకాలను వివిధ పాఠశాలలకు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయులు తరలివచ్చి పుస్తకాలను తీసుకెళ్లారు.

కౌతాళం: పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా గురువారం విద్యార్థులు హుషారుగా బడులకు చేరుకున్నారు. మండలంలో జెడ్పీ పాఠశాలలు 13, యూపీ పాఠశాలలు 6, ప్రాథమిక పాఠశాలలు 39 ఉన్నాయి. వీటిలో 13725 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మొదటి రోజు విద్యార్థులు కాస్త తక్కువ సంఖ్యలో పాఠశాలలకు హాజరయ్యారు. ప్రార్థన, పరిచయం తరగతుల ప్రారంభం తర్వాత విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలకు తరలివచ్చి తమ పిల్లలను బడిలో చేర్పించారు.

పాఠశాలలకు పుస్తకాల తరలింపు


విద్యా కానుకను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు పంపిణీ చేస్తున్న ఎంఈఓ-2 నీలకంఠ


ఉపాధ్యాయులకు పుస్తకాలను అందజేస్తున్న నాయకులు


నందవరం ఎంఆర్సీ నుంచి పాఠ్యపుస్తకాలను తరలిస్తున్న ఎంఈఓ రఘునాథ్

కౌతాళం: విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న పుస్తకాలను ఉపయోగించుకోవాలని ఎంఈఓ శోభారాణి, ఉరుకుంద ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ చెన్నబసప్ప, కౌతాళం సింగిల్ విండో మాజీ ఉపాధ్యక్షుడు వెంకటపతిరాజు సూచించారు. మండలానికి మంజూరైన పాఠ్య పుస్తకాలను స్థానిక ఎంఆర్‌సీ భవనం వద్ద గురువారం ఎంఈఓతో కలిసి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలానికి 75,748 టెక్స్ట్ బుక్‌లు, 13,460 నోట్ పుస్తకాలు, 13,125 బ్యాగులు వచ్చినట్లు ఎంఈఓ శోభారాణి తెలిపారు. వీటిని త్వరలోనే విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. నాయకులు రాజబాబు, సిద్ధూ, మంజునాథ్, కాశీ విశ్వనాథ్, సునీల్, చంద్రశేఖర్ పలువురు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

గోనెగండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల అభ్యున్నతికే విద్యా కానుకను అందజేస్తున్నట్లు ఎంఈఓ-2 నీలకంఠ తెలిపారు. గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరిన విద్యా కానుక కిట్లను గురువారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 55 పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు 10,600 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. చదువుకు పేదరికం అడ్డుకాకూడదని, బడి బయట పిల్లలు బడిలో ఉండాలని గొప్ప లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకొని బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు నేటి నుంచి పాఠశాలల్లో విద్యార్థులకు కిట్లను పంపిణీ చేస్తారని తెలిపారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నందవరం: 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ బడులకు ప్రభుత్వం అందించిన పాఠ్య పుస్తకాలు, బ్యాగ్‌లు, నోటుబుక్స్ పంపిణీ ప్రారంభమైంది. గురువారం ఎంఆర్సీ నుంచి ఎంఈఓ-2 రఘునాథ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలను ప్రత్యేక వాహనాలలో ఆయా స్కూల్ హెచ్‌ఎంలు, సీఆర్పీల నేతృత్వంలో తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు 12,173, 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 24,725 పాఠ్య పుస్తకాలు, 42 వేల నోట్ బుక్స్ పంపిణీ చేశామన్నారు. ఈ నెల 15వ తేదీలోపు మండలంలోని అన్ని పాఠశాలకు పుస్తకాలను అందజేస్తామని వివరించారు. సీఆర్పీలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

నందవరం: మండలంలోని ముగతి ఏపీ మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 7, 8, 9వ, తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడ్మిషన్ కోసం విద్యార్థులు శుక్రవారం స్థానిక మోడల్ స్కూల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 21వ తేదీన మోడల్ స్కూల్‌లో ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష ఉంటుందని, అందులో చూపిన ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. వివరాలకు ప్రిన్సిపాల్ ఫోన్ నంబర్ 80745 80647ను సంప్రదించాలని సూచించారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడివెళ్ల ఏపీ మోడల్ స్కూల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాఘవేంద్ర సూచించారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. 7వ తరగతిలో 30 సీట్లు, 8వ తరగతిలో 2 సీట్లు, 9వ తరగతిలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

ఈ నెల 19వ తేదీలోపు పాఠశాలకు వచ్చి పేర్లు నమోదు చేయించుకోవాలని చెప్పారు. 21న ప్రవేశపరీక్ష నిర్వహించి నిబంధనల ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామని వెల్లడించారు. అలాగే 6వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు ఎంపికైన వారు 18వ తేదీలోపు పాఠశాలలో చేరాలన్నారు.

డీటీఎఫ్ జిల్లా, రాష్ట్ర కమిటీలో చోటుపై హర్షం


రాష్ట్ర కౌన్సిలర్ రవీంద్ర


జిల్లా అధ్యక్షుడు వెంకటరాముడు

పెద్దకడుబూరు: డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా మండల పరిధిలోని గంగులపాడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటరాముడును, రాష్ట్ర కౌన్సిలర్‌గా కంబలదిన్నె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కరె రవీంద్రను జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎంపిక చేయడంపై డీటీఎఫ్ మండలాధ్యక్షుడు రాఘవేంద్రరావు, ప్రధానకార్యదర్శి దేవేంద్ర హర్షం వ్యక్తం చేశారు. గురువారం వారు మాట్లాడుతూ.. ఇటీవల డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ 17వ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశాలు కర్నూలులో జరిగినట్లు తెలిపారు. ఈ సమావేశంలో వీరిద్దరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. వెంకటరాముడు, రవీంద్రలు గత 25 ఏళ్లుగా మండల కమిటీ, జిల్లా కమిటీలో ఉంటూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేశారని వివరించారు. జిల్లా బాధ్యులు బి.శ్రీనివాసులు, పి.శ్రీనివాసులు, మండల బాధ్యులు జయరాజు, హసన్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ డొనేషన్లు అరికట్టాలి



నిరసన తెలుపుతున్న ఆర్‌ఏవీఎఫ్ నాయకులు

ఆదోని సెంట్రల్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అక్రమ డొనేషన్లు అరికట్టాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా, కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఆర్ఏవీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. జీవో నంబర్-1 ఉల్లంఘించి పాఠశాలల్లోనే పాఠ్య పుస్తకాలు, షూస్, బ్యాగులు అమ్ముతూ పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మార్చారని, వీటిని నియంత్రించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ డొనేషన్లు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. ఆర్ఏవీఎఫ్ నాయకులు రవీంద్ర, సోమనాథ, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆదోని అర్బన్: ఆదోని పట్టణంలోని మండిగిరి 18వ వార్డులో నూనె వెంకటేశ్వర్లు భార్య తిరుపతమ్మ గుండెపోటుకు గురై గురువారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ యువ నాయకుడు సిద్ధార్థనాయుడు, కాలనీ నాయకులు మురళి, నగేష్, రాఘవేంద్ర, తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మట్టి ఖర్చులకు రూ.6 వేలు ఆర్థిక సాయం అందించారు.

మొక్కలు నాటి పరిరక్షించాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి పరిరక్షిస్తేనే పర్యావరణ పరిరక్షణతో పాటు హరిత పట్టణంగా మార్చవచ్చని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మిలటరీ కాలనీలో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ.. మొక్కలను పెంచడం ద్వారా ప్రయోజనాలను వివరించారు. సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పునీత ఆంథోని వేడుకలు


హాజరైన క్రైస్తవులు


దైవ సందేశం వినిపిస్తున్న గురువులు

ఆదోని సెంట్రల్: సుప్రసిద్ధ క్యాథలిక్ గురువు దివంగత పునీత ఆంథోని వేడుకలను క్రైస్తవులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని పునీత అనాథాశ్రమ పాఠశాలలో డైరెక్టర్ కరెస్పాండెంట్ ఫాదర్ రెవరెండ్ జాన్ డేవిడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో కర్నూలు పాస్టల్ సెంటర్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ బాలరాజు, రెవరెండ్ ఫాదర్ అవుల జాన్ దేవదాసు పాల్గొని వాక్యోపదేశం అందించారు. పునీత ఆంథోని చేసిన సేవలను, అద్భుతాలను వివరించారు. కార్యక్రమానికి కర్ణాటక, బళ్లారి, రామదుర్గం ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భోజన వసతి కల్పించారు. కర్నూలు, నందికొట్కూరుకు చెందిన ఫాదర్ లోకదళ్, బాలయేసు, గల్లెల విజయ్‌కుమార్, రామదుర్గంకు చెందిన ఫాదర్ జోసఫ్ కుమార్‌తో పాటు 16 మంది గురువులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సత్కారం


శాలువా, పూలమాలలతో సత్కరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కోసిగి: మండల పరిధిలోని అగసనూరు గ్రామంలో నలుగురు విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపిక కావడంతో వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను గురువారం విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాపారాయుడు, ఉపాధ్యాయుడు మహబూబ్ బాషా శిక్షణలో 5వ తరగతిలో గురుకుల పాఠశాలలకు ప్రవేశ పరీక్ష రాసి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇందులో ఉమాదేవి (82/100) మార్కులు సాధించి ఏపీఆర్ఎస్ పత్తికొండ గురుకుల పాఠశాలకు, టి.కె.సన్నిధి (81/100) మార్కులు సాధించి ఏపీఆర్ఎస్, బనవాసి గురుకుల స్కూల్‌కు, ఎం.రామకృష్ణ (47/50) మార్కులు సాధించి జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల గోరంట్లకు, వై.లక్ష్మీకాంత్ రెడ్డి (43/50) మార్కులు సాధించి జ్యోతిరావు పూలు గురుకులం, బేతంచర్ల పాఠశాలకు ఎంపికయ్యారు. విద్యార్థుల ఎంపికకకు కృషి చేసిన ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు, జనచైతన్య సంఘం సభ్యులు శాలువా, పూలమాలలు వేసి సత్కరించారు. గ్రామస్తులు నరసప్ప, లక్ష్మన్న, ఆకాశ్ రెడ్డి,వీరారెడ్డి, అంజిరెడ్డి, శివప్ప, రాముడు, మహాదేవా, లోకేష్, హనుమంతు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పటిష్టమైనది భారతి సిమెంటు


ప్రమాద బీమా బాండ్లతో పాటు కిట్లను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: అత్యుత్తమ భవన నిర్మాణాలకు పటిష్టమైనది భారతి సిమెంటు అని ఆ కంపెనీ జిల్లా సెల్స్ ఆఫీసర్ ఇక్బాల్‌బాషా, ఉదయ్‌లక్షణ్ అన్నారు. బాపురం రోడ్డులోని స్థానిక శ్రీలక్ష్మి ఏజెన్సీస్‌లో గురువారం తాపీ మేస్త్రీలకు సిమెంటు నాణ్యత వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. 60 మంది మేస్త్రీలకు లక్ష రూపాయల ఉచిత బీమా బాండ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోబోటిక్ జర్మనీ టెక్నాలజీతో భారతి సిమెంటు తయారవుతుందన్నారు. అల్ట్రా ఫాస్ట్ నాణ్యత కలిగి ఉంటుందన్నారు. ఇతర రకం సిమెంట్ ఐదు గంటల్లో సెట్ అయితే భారతి అల్ట్రా ఫాస్ట్ 2 గంటల్లోనే సెట్ అవుతుందన్నారు. ఎక్కువ దృఢత్వాన్ని కలిగి ఉంటుందని వివరించారు. ఏజెన్సీ డీలరు బసవరాజ్ స్వామి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

నీట్ ఫలితాలపై విచారణ చేపట్టాలి


మాట్లాడుతున్న ఎస్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్

ఎమ్మిగనూరుటౌన్: నీట్ పరీక్షపై వచ్చిన ఆరోపణలు, అనుమానాలపై సమగ్ర విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో నీట్ ఫలితాలపై విచారణ కోరుతూ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. నీట్ నిర్వహణ బాధ్యతలు తీసుకున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వ్యవహరించిన తీరుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. లక్షలాది మంది విద్యార్థులు నీట్ ఫలితాలపై అనుమానాలను వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రత్యేక దర్యాప్తు సంస్థచే విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకొని విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఎన్ఎస్‌యూఐ నాయకులు జాకీర్, సాయితేజ, కుమార్, హర్ష తదితరులు పాల్గొన్నారు.